క్లుప్తంగా

'గ్రీవెన్స్'తో అర్జీల పరిష్కారం



హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ ప్రతినిధికి చెక్కు అందజేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్ని అర్జీలను తక్షణం పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

➡ సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ సంస్థకు కె.కె.రాజు చేతుల మీదుగా రూ.25 వేలను చెక్కును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌వర్మ, రాము, శ్రీను, వర్మ, అభిమానులు పాల్గొన్నారు.

ఇక సాయంత్రం వేళలో రైతుబజార్



నరసింహనగర్ రైతుబజార్‌లో సాయంత్రం పూట కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

సీతంపేట: వినియోగదారులకు మరింత సౌలభ్యంగా ఉండేలా నరసింహనగర్ రైతుబజార్‌లో శుక్రవారం నుంచి సాయంత్రం బజారు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఉదయం పూట మాత్రమే ఉండే బజారు ఇక నుంచి ప్రతి రోజూ సాయంత్రం కూడా అందుబాటులో ఉంటుందని ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రైతుబజారు కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం 30 మంది వ్యాపారులు సాయంత్రం పూట కూరగాయలు విక్రయిస్తున్నారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



ఇందిరానగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం ఇందిరానగర్, బాపూజీనగర్, శ్రీనివాస్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం కాలువలు, డ్రైనేజీల పనులను పరిశీలించారు. కార్పొరేటర్ గంకల కవిత ఆదేశాల మేరకు అధికారులు పనులను వేగవంతం చేశారు. మరిన్ని నిధులు మంజూరు కావడంతో త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని ఆమె తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు మత్స్యరాజు, భరణికుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు గంకల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'భూ హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాం'

సీతంపేట: ఏపీ భూ హక్కుల చట్టం వల్ల స్థిరాస్తి యజమానులు అయోమయంలో పడ్డారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థిరాస్తి హక్కు ఉన్నా కోర్టును ఆశ్రయించలేని పరిస్థితి ఎదురవుతోందని, రెవెన్యూ చట్టాలు, కోర్టు తీర్పులు ఉన్నా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ చట్టాన్ని జనసేన పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, శ్రీనివాస్ పట్నాయక్, నాగలక్ష్మీ చౌదరి పాల్గొన్నారు.

ఇది కదా అభివృద్ధి

డ్రైనేజీలకు మోక్షం

42వ వార్డులో డ్రైనేజీల ఆధునికీకరణకు చేసిన ఖర్చు రూ.1.39 కోట్లు

45వ వార్డులో డ్రైనేజీల ఆధునికీకరణకు చేసిన ఖర్చు రూ.95 లక్షలు

- 42, 45 వార్డుల్లో అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ
- దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం
- అభివృద్ధి పనులపై స్థానికుల హర్షం



45వ వార్డు సత్యసాయినగర్‌లో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది. మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రతి ప్రాంతాభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రయోజనకర పనులు చేపడుతోంది. ఈమేరకు ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ 42, 45 వార్డుల్లో లక్షల రూపాయల నిధులతో డ్రైనేజీలను ఆధునికీకరించి.. నివాసుల ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపారు.

42వ వార్డులో..

జీవీఎంసీ 42వ వార్డులోని శిథిల డ్రైనేజీలకు మోక్షం లభించింది. రైల్వే న్యూకాలనీ, జగన్నాథపురం, మసీదు వీధి ప్రాంతాల్లో సుమారు రూ.1.39 కోట్ల నిధులతో డ్రైనేజీలను ఆధునికీకరించారు. ఈ ప్రాంతాల్లో సుమారు పదేళ్ల కిందట నాటి డ్రైనేజీ వ్యవస్థతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జీవీఎంసీ ఎన్నికలు పూర్తి కాగానే వార్డు కార్పొరేటర్‌గా ఎన్నికైన ఆళ్ల లీలావతి శ్రీనివాస్ చొరవతో ఈ డ్రైనేజీలను ఆధునికీకరించి, ప్రజల చిరకాల కోరికను నెరవేర్చారు. ఈ సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.



42వ వార్డు రామాలయం వీధిలో క్లోజ్డ్ డ్రైనేజీ

45వ వార్డులో..

జీవీఎంసీ 45వ వార్డులోని అధ్వాన డ్రైనేజీలు ఎట్టకేలకు బాగుపడ్డాయి. గణేష్‌నగర్, చిట్టిబాబు కాలనీ, సంతోషిమాత కాలనీ, ప్రశాంతినగర్, సత్యసాయినగర్, సింహగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న పలు డ్రైనేజీలను ఆధునికీకరించారు. సుమారు రూ.95 లక్షలను ఈ పనుల కోసం వెచ్చించారు. సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, వరాహగిరి కాలనీ–1 వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా కాలువలు ఘోర స్థితిలో ఉండేవి. వీటి ఆధునికీకరణ కోసం కార్పొరేటర్ కంపా హనోకు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ప్రాధాన్యతా క్రమంలో ఈ పనులను పూర్తి చేశారు. కొన్ని ప్రాంతాల్లో పాత డ్రైనేజీల స్థానంలో మరింత విశాలంగా, లోతైన, వెడల్పుగా కొత్త వాటిని నిర్మించారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడితే డ్రైనేజీలు నిండి, పొంగి ఇళ్లలోకి మురుగునీరు చేరేది. నేడు డ్రైనేజీల ఆధునికీకరణ వల్ల ఈ సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైల్వే న్యూకాలనీలో ఆధునికీకరించిన డ్రైనేజీ

ఇబ్బందులు తొలగాయి



జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని శిథిల డ్రైనేజీలతో కొన్నేళ్లుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అంచెలంచెలుగా అభివృద్ధి పనులను ప్రారంభించింది. దీనిలో భాగంగా డ్రైనేజీల ఆధునికీకరణ చేపట్టి రైల్వే న్యూకాలనీ వీధుల్లో, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో పనులు పూర్తి చేసింది.

– గాలి ప్రసాద్, రైల్వే న్యూకాలనీ

సమస్య పరిష్కారమైంది



45వ వార్డు సత్యసాయినగర్, వరాహగిరి కాలనీల్లోని పాత డ్రైనేజీలతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. చినుకు పడితే కాలువలు పొంగి ఇళ్లలోకి మురుగు నీరు ప్రవహించేది. ఈ ప్రాంతాల్లో ఇటీవల డ్రైనేజీ పనులను పూర్తి చేశారు. సమస్య పరిష్కారం కావడంతో ఎంతో ఆనందంగా ఉంది.

– కారుకొండ రాజుయాదవ్, సత్యసాయినగర్ అధ్యక్షుడు

ఆలస్యంగా బయల్దేరిన ఏపీ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: విశాఖలో శుక్రవారం రాత్రి 10 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ పెయిరింగ్ రైలు ఆలస్యంగా నడుస్తున్నందున సుమారు 12 గంటలు ఆలస్యంగా శనివారం ఉదయం 9.30 గంటలకు బయల్దేరుతుందని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ప్రయాణికులు మార్పులను గమనించి, సహకరించాలని కోరారు.

టాటానగర్–ఎర్నాకుళం ఫ్రీక్వెన్సీ పెంపు లేదు..

టాటానగర్–ఎర్నాకుళం–టాటానగర్(18189/18190) ఎక్స్‌ప్రెస్ వారానికి ఐదు రోజులు నడుస్తుందని ఇటీవల ప్రకటించారు. ఈ రైలు గతంలో మాదిరి బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గానే ప్రస్తుతం నడుస్తున్న రోజుల్లోనే నడుస్తుందని, ప్రయాణికులు మార్పును గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

జాబ్‌మేళాలో 53 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి శాంతి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), శాంతి(టెక్నికల్) తెలిపారు. సుమారు 08 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 1,215 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 135 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 53 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన వారికి ఎంప్లాయిమెంట్ అధికారుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఉద్యోగార్థులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పన్నుల విభాగంలో ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకం

విశాఖ సిటీ: కస్టమ్స్, జీఎస్టీలో ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకమని కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ అన్నారు. శుక్రవారం అక్కయ్యపాలెం నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్(ఎన్ఏసీఐఎన్) కార్యాలయంలో జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లు, కస్టమ్స్ ప్రివెంటివ్ ఆఫీసర్లు, ఎగ్జామినర్ల 14 వారాల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్లు డిపార్ట్‌మెంట్‌లో ముందు వరుసలో ఉంటారని, పన్ను చెల్లింపుదారులతో నిత్యం సంబంధం కలిగి ఉండేది వారేనని పేర్కొన్నారు. పన్ను ఎగవేత కేసులు పెట్టడం, వాటి విచారణలో వారి పాత్ర చాలా ఉంటుందని వెల్లడించారు. ఫ్రంట్‌లైన్ సిబ్బంది ఒక్క కేసును గుర్తిస్తే ప్రభుత్వానికి రూ.వందల కోట్ల పన్ను వస్తుందన్నారు. జీఎస్టీ ఇంటెలిజెన్స్ ఏడీజీ ఎం.ఆర్.ఆర్. రెడ్డి మాట్లాడుతూ కేసులు గుర్తించడంలో అధికారులు తెలుసుకోవాల్సిన సరికొత్త టెక్నాలజీ టూల్స్, డేటా అనలిటిక్స్, ఇతర సాంకేతికతలను వివరించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ నిజాయతీకి మించిన విలువ లేదని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ నివేదిక అందజేసి పట్టభద్రులైన అధికారులను సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎన్ఏసీఐఎన్ అదనపు డైరెక్టర్ ఈదర రవికిరణ్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీలను అభినందించారు.



మాట్లాడుతున్న కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్

త్వరితగతిన అట్రాసిటీ కేసుల పరిష్కారం

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని వివిధ విభాగాల అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కలెక్టర్ స్పందించారు. క్లిష్టమైన కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని, వివరాల సేకరణలో జాప్యం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. సివిల్ రైట్స్‌పై సామాన్యులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. స్టే కేసులపై ప్రత్యేక చొరవ చూపి హైకోర్టు పీపీతో సంప్రదించాలని స్థానిక పీపీకి చెప్పారు. స్పందన ద్వారా వచ్చే కేసులు, దిశ ద్వారా నమోదయ్యే కేసులకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చే రిలీఫ్, రిహాబిలిటేషన్ ఆర్థిక సాయం అందించాలని సంబంధిత అధికారులు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, డీసీపీ క్రైం వెంకటరత్నం, పలువురు ఏసీపీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా..

ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుకి చేరేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. నవరత్నాల సంక్షేమ ఫలాలు అందరికీ అందేందుకు మండలాల వారీగా పర్యవేక్షణ అవసరమని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు 11 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలు తెలపాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రత్యేక అధికారులు వీరే..

మండలం	ప్రత్యేకాధికారి పేరు	హోదా
విశాఖపట్నం రూరల్	జీవీఎస్ఎస్ రామమోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
సీతమ్మధార	చక్రవర్తి	డీపీవో, జీవీఎంసీ
మహారాణిపేట	చంద్రిక	డీపీవో, జీవీఎంసీ
గోపాలపట్నం	పి. శేషశైలజ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ములగాడ	టి. ప్రవీణ	జిల్లా కో–ఆపరేటివ్ అధికారి
గాజువాక	డి. లక్ష్మారెడ్డి	ఎస్టేట్ అధికారి, వీఎంఆర్డీఏ

సౌత్ ఇండియా పోటీలకు 'కూల్ హెల్మెట్'

విశాఖ విద్య: జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు పాలగుమ్మి రాజారావు రూపొందించిన కూల్ హెల్మెట్ ప్రాజెక్టు ప్రదర్శన ద్వారా రాష్ట్ర స్థాయిలో అధికారుల ప్రశంసలందుకున్నారు. కడపలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన రాజారావు మాస్టారు, తాను తయారు చేసిన కూల్ హెల్మెట్ ప్రాజెక్టును ప్రదర్శించారు. 26 జిల్లాల నుంచి టీచర్ కేటగిరీలో పది మంది ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనగా, వీరిలో రాజారావు రూపొందించిన ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది. దీంతో త్వరలో జరుగనున్న సౌత్‌ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికైన రాజారావుకు జిల్లా విద్యాశాఖాధికారులు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

6న సామాజిక సాధికార బస్సుయాత్ర

- మారియట్ హోటల్ నుంచి భారీ బైక్ ర్యాలీ
- పెద్ద ఎత్తున బహిరంగ సభ
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు వెల్లడి
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు



బస్సుయాత్ర వివరాలను వెల్లడిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు



పార్టీ యువజన విభాగం నాయకులతో చర్చిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో కొత్త ఏడాది జనవరి 6న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ 6వ తేదీన ఉదయం 11.30 గంటల సమయంలో 26వ వార్డు ఎన్‌జీజీవోఎస్ కాలనీలో స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేసిన జీవీఎంసీ హైస్కూల్‌ను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చేతుల మీదగా ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడ నుంచి నేరుగా ఆర్ అండ్ బీ దరి మారియట్ హోటల్ వద్దకు చేరుకుని.. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భారీ బైక్ ర్యాలీతో బయలు దేరి కైలాసపురం దరి ఇనార్బిట్ మాల్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, పార్టీ మండల అధ్యక్షుడు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సారిపల్లి గోవింద్, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు నీలి రవి, పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, కె.పి.రత్నాకర్, ఫారూఖీ, కిరణ్‌రాజు, మండల ఇన్‌చార్జులు, డైరెక్టర్లు, మహిళా నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

యువజన విభాగం నాయకులతో సమావేశం

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో కె.కె.రాజు శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ ర్యాలీకి యువకులు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో 90 రోజుల పాటు యువకులంతా యాక్టివ్‌గా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, ఎం.సునీల్‌కుమార్, చిన్నా, సంతోష్, గణేష్, కృపా, లోకేష్, డి.సంతోష్, బషీర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో హెచ్‌టీ లైన్స్ నిర్వహణ, కొత్త లైన్ ఏర్పాటు పనుల నిమిత్తం శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఆపరేషన్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహారాణి పార్లర్, జీవీఎంసీ హైస్కూల్, చిన్నూరు, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం

మురళీనగర్: దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర వహించిన సీపీఐ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతోందని పార్టీ ఉత్తర నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. మాధవధార 48 బస్టాప్ కూడలిలో శుక్రవారం సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వేళలా పార్టీకి కార్యకర్తలే అండదండలుగా నిలిచారన్నారు. పార్టీ నిర్వహించే ప్రజా పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకుడు కోన గోపాలం ఆవిష్కరించి ఉత్సవాలు ప్రారంభించారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కోన గోపాలం

కార్యక్రమంలో సీపీఐ ఉత్తర సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు, మాధవధార శాఖ కార్యదర్శి ఎస్.గౌరీశంకర్, కంచరపాలెం శాఖ కార్యదర్శి వాసుపల్లి నల్లనయ్య, పార్టీ సభ్యులు నంబాల ఉమామహేశ్వరరావు, సనపల గాంధీ, సంతోష్‌కుమార్, అప్పారావు, శివప్రకాష్ పాల్గొన్నారు.

'వికసిత్ భారత్ యాత్ర'లో భాగస్వామ్యం కండి

దాబాగార్డెన్స్: స్వచ్ఛంద సేవకులు వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగస్వామ్యం కావాలని, ఇది అందరి సత్ సంకల్పమని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ తెలిపారు. 36వ వార్డు రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ వద్ద శుక్రవారం భారత్ సంకల్ప్ యాత్రలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలు రూపొందించి అమలు చేస్తోందన్నారు.

రామాటాకీస్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాటాకీస్ జంక్షన్‌లో శుక్రవారం భారీ లారీతో పాటు బస్సులు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు అర గంట పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహన చోదకులు, విద్యార్థులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. సత్యం జంక్షన్, మద్దిలపాలెం, శ్రీనగర్ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలన్నీ ఒక్కసారిగా ఆగిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ జాడ కనిపించకపోవడం విశేషం. భారీ లారీలు రావడంతో ఈ సమస్య జటిలంగా మారింది. అదే సమయంలో ఓ ఆర్టీసీ బస్సు కండక్టర్ చొరవ తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో యథావిధిగా వాహనాలు రాకపోకలు కొనసాగాయి.



రామాటాకీస్ జంక్షన్‌లో నిలిచిపోయిన వాహనాలు

విద్యార్థుల్లో నైతిక విలువలకు ప్రాధాన్యం

సీతంపేట: విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేలా విద్యా విధానం ఉండాలని గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సి.వి.రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. సీతంపేటలోని వి.టి. హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన 77 వసంతాల మెగా జూబ్లీ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పారిశ్రామిక ప్రగతిలో భాగమయ్యేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. న్యాయవాది పి.వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యతోపాటు విలువలను నేటితరానికి అందించడంలో వి.టి. స్కూల్ ముందుందన్నారు. ప్రిన్సిపాల్ పి.ఎస్.రావు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడటం తమకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పి.రమణ మాట్లాడుతూ శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ఉత్తమ విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, నెమలి నృత్యం, దశావతారం, థింసా, నాటు నాటు డ్యాన్స్‌లు అలరించాయి. హెచ్‌ఎం పి.లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సి.వి.రావు, నారాయణరావు